హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలి

- పిల్లలకు పౌష్టికాహారం అందించాలి
- ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేయాలి
- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదు
- కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, ఆగస్టు 30: సంక్షేమ హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ, వెల్ఫేర్, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే, హాస్టళ్లలో ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. పిల్లలకు అసౌకర్యాలు, ఆహారం అందించడంలో లోపాలు ఉన్నా విద్యార్థులు రాసి బాక్స్‌లో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాక్స్‌లు కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు.

కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎంపీ కావ్య

కలెక్టర్‌ను కలిసి ఎంపీ కావ్య

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారదను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పూల మొక్క అందజేశారు. అనంతరం కలెక్టర్ ఆమెను తన చాంబర్‌లోకి ఆహ్వానించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పనుల అమలు తీరుపై చర్చించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు, కేంద్ర పురావస్తు శాఖ తదితర అంశాలపై మాట్లాడారు.

ఫిర్యాదుల బాక్స్ తాళం చెవులు తన వద్దే ఉంటాయని, ఫిర్యాదు చేసిన విద్యార్థుల పేర్లను రహస్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలబాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతోపాటు సమాజంలోని స్థితిగతులను పరిగణలోకి తీసుకొని విద్యార్థులు, టీచర్లు స్నేహభావంతో మెలిగే వాతావరణాన్ని కల్పించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహిస్తామన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, జోనల్ ఆర్జీవో స్వరూపారాణి, పర్వతగిరి డీసీవో అపర్ణ, డీఈవో జ్ఞానేశ్వర్, డీబీసీడీవో పుష్పలత, డీఎస్సీడీఈవో భాగ్యలక్ష్మి, వర్ధన్నపేట సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

మినీ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నర్సంపేట రూరల్, ఆగస్టు 30: పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. నర్సంపేట పట్టణం ద్వారకపేటలోని అంగన్‌వాడీ కేంద్రం, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులన్నీ పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. సెంటర్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించడంతోపాటు మెనూను విధిగా పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశ్, నర్సంపేట ఐసీడీఎస్ సీడీపీవో మధురిమ, సూపర్‌వైజర్ రవి, ఆర్ఐ రజాక్, అంగన్‌వాడీ టీచర్ సవిత పాల్గొన్నారు.

మక్కలు @ రూ. 2,960

రైతు ఎర్ర ప్రతాప్

కాశీబుగ్గ, ఆగస్టు 30: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మక్క ల ధర రోజురోజుకూ పెరుగుతున్నది. శుక్రవారం రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు రూ. 2,960 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ఇది మార్కెట్ చరిత్రలోనే రికార్డు ధర అని, ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన ఎర్ర ప్రతాప్ పది బస్తాలు తీసుకురాగా, లక్ష్మీప్రియ ట్రేడర్స్ అడ్డి ద్వారా శ్రీజయలక్ష్మి ట్రేడర్స్ ఖరీదు వ్యాపారి కొనుగోలు చేశారు.

విచారణ చేస్తున్న రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ శాఖ అధికారులు

పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ

నల్లబెల్లి, ఆగస్టు 30: ప్రాథమిక సహకార సంఘంలో అక్రమాలు జరిగాయని వస్తున్న అరోపణలపై రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీశాఖ అధికారులు శుక్రవారం మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధికారులు రవిచందర్, మహ్మద్ యూసఫ్ అలీ కార్యాలయంలోని కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, పంట రుణ మాఫీలో ఆధార్ మిస్‌మ్యాచ్ కారణంగా రుణమాఫీకి అనర్హులుగా మారిన రైతుల వివరాలను 32 ఫార్మాట్‌కు సంబంధించిన రికార్డులను మూడు రోజుల్లో సంబంధిత పీఏసీఎస్ కార్యాలయంతోపాటు డీసీసీబీ అధికారులు తమకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

'నమస్తే' కథనానికి స్పందన

పరిశుభ్రంగా ఉన్న రోడ్డు పరిసరాలు

నర్సంపేట, ఆగస్టు 30: నర్సంపేట పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న రోడ్డు పరిసరాలను ఎట్టకేలకు శుభ్రం చేశారు. రోడ్డు వెంట చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మేరకు 'ముక్కుపుటలదిరేలా' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. దీంతో సమస్య పరిష్కారానికి కృషి చేసిన నమస్తే తెలంగాణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల బారిన పడొద్దు

ఖానాపురం, ఆగస్టు 30: గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, పీహెచ్‌సీ సంయుక్తంగా బుధరావుపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో హాజరై మాట్లాడారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మల్యాల అరుణ్‌కుమార్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కరీమాబాద్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కార్పొరేటర్ పల్లం పద్మ సూచించారు. బీరన్నకుంటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పల్లం పద్మ పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు చేసుకున్న వారికి మందులు అందజేశారు. మాజీ కార్పొరేటర్ పల్లం రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపురం: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

బస్టాండ్ కిటకిట

నర్సంపేట, ఆగస్టు 30: నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. శ్రావణ శుక్రవారం కావడంతో వివిధ శుభకార్యాలకు ప్రయాణికులు పెద్ద ఎత్తున బయల్దేరారు. దీంతో బస్సులు ఎన్ని వేసినా క్షణంలో నిండిపోయాయి. బస్సులు సరిపోను లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

మాట్లాడుతున్న కల్నల్ రామదురై

నర్సంపేట రూరల్, ఆగస్టు 30: విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని ఎన్‌సీసీ 10వ బెటాలియన్ అధికారి కల్నల్ రామదురై అన్నారు. లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్‌ను శుక్రవారం ఎన్‌సీసీ అధికారులు పరిశీలించారు. ఎన్‌సీసీ 10వ బెటాలియన్ అధికారి కల్నల్ రామదురై ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఆక్టివిటీస్, అటెండెన్స్, ట్రైనింగ్ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఎన్‌సీసీ వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. బిట్స్ చైర్మన్ డాక్టర్ అండ్రు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్, ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

బోధనా రీతులను మెరుగుపర్చుకోవాలి

డీఐఈవో శ్రీధర్ సుమన్

రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరిస్తున్న డీఐఈవో

నర్సంపేటరూరల్, ఆగస్టు 30: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల హాజరు, సిలబస్ పూర్తిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ బోధనా రీతులను మెరుగుపర్చుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) డాక్టర్ శ్రీధర్ సుమన్ సూచించారు. నర్సంపేట పట్టణం సర్వాపురం శివారులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు అధ్యాపకుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కళాశాలలో ప్రయోగశాల, గ్రంథాలయ ఏర్పాటు, మౌలిక సదుపాయాలు పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సువర్ణతోపాటు అధ్యాపకుల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన ప్రింటర్‌ను డీఐఈవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంపత్‌కుమార్, సువర్ణ, కార్యాలయ సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

3న నర్సంపేటలో ప్రజావేదిక

నర్సంపేట రూరల్, ఆగస్టు 30: ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై సెప్టెంబర్ 3న మండల సామాజిక తనిఖీ ప్రజావేదికను పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 27గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి గత మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై అధికారులు ప్రజావేదికలో చర్చిస్తారని చెప్పారు. ఎంపీవో రామ్మోహన్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు చంద్రకళ, కొండల్‌రెడ్డి, సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, టైపిస్టు అరుణ పాల్గొన్నారు.

రేపు వరంగల్‌లో ర్యాలీ

కాశీబుగ్గ, ఆగస్టు 30: డబ్ల్యూఎఫ్ఎస్‌కే జిల్లా కరాటే మాస్టర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు వరంగల్ పోచమ్మమైదాన్ సర్కిల్ నుంచి హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గడదాసు మణికంఠ తెలిపారు. కరాటే మాస్టర్స్, తెలంగాణ పోలీస్ కరాటే కోచ్ సురేశ్, డబ్ల్యూఎఫ్ఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని కరాటే మాస్టర్స్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యువత, విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు.

కుక్కల పట్టివేత

కుక్కను బంధిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ, ఆగస్టు 30: వరంగల్ 21వ డివిజన్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉండడంతో స్థానికులు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ పుర్కాన్ ఆధ్వర్యంలో శుక్రవారం యానిమల్ బర్త్ కంట్రోల్ సిబ్బంది కుక్కలను బంధించి తీసుకెళ్లారు.

బొడ్రాయి కమిటీకి విరాళం

కాశీబుగ్గ, ఆగస్టు 30: వరంగల్ 3వ డివిజన్ పరిధిలోని కొత్తపేటలో ఇటీవల బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ శుక్రవారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అభివృద్ధి కమిటీకి రూ. 50,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు లంకా ప్రతాప్‌రెడ్డి, నాగవరపు సుధాకర్, అనుమాండ్ల అనిల్, నేరెళ్ల శ్రీనివాస్, ఇందూరి నరేందర్, కొండా కుమారస్వామి, పురం సతీశ్, నేరెళ్ల రాజు, గాదె రాము, మేకల నవీన్, చింతాకుల తిరుపతిరెడ్డి, షాబాదు మధు, పడమటి శ్రీధర్, హిందువుల రంజిత్, తాళ్లపెల్లి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

డివిజన్‌లో భారీ వర్షం

నర్సంపేట, ఆగస్టు 30: నర్సంపేట పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. అలాగే, నల్లబెల్లి మండలంలో కుండపోత వర్షం కురిసింది. వానకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఏనాడూ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడలేదు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా మండలవ్యాప్తంగా పడిన కుండపోత వర్షంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు.

ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం

ఖిలావరంగల్, ఆగస్టు 30: జిల్లాలోని ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దుగ్గొండిలో 40.5 మిల్లీమీటర్లు, నల్లబెల్లిలో 30.2, చెన్నారావుపేటలో 30, నర్సంపేటలో 25, ఖానాపురంలో 19 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నర్సంపేటలో కురిసిన భారీ వర్షం

నల్లబెల్లిలో కురుస్తున్న వర్షం

'ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి'

పర్వతగిరి, ఆగస్టు 30: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏలోకి మార్చాలని మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ డిమాండ్ చేశారు. అన్నారంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీని స్థానిక సంస్థల ఎన్నికల్లోగా అమలు చేయాలని కోరారు. మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, మానుకోట ప్రధాన కార్యదర్శి అశోక్, మహేశ్, మహేందర్, రమేశ్, సురేశ్, మహేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పెర్కవేడువాసికి డాక్టరేట్

రవికుమార్

రాయపర్తి, ఆగస్టు 30: పెర్కవేడుకు చెందిన బొమ్మెర రవికుమార్ శుక్రవారం రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నాడు. జేఎన్టీయూ పరిధిలోని శ్రీనిధి కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో 'సింథసిస్, యాంటీ క్యాన్సర్ ఎవల్యూషన్ అండ్ డాకింగ్ స్టడీస్ ఆఫ్ ఆక్సిజోల్ ఇండోల్ పైరిమిదిన్ అండ్ బెంజ్ ఆక్సిల్ ఆల్ డెరెటీవ్' అంశంపై ఆయన తన పరిశోధనను పూర్తి చేశాడు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

నల్లబెల్లి/ఖానాపురం, ఆగస్టు 30: రుణమాఫీ కాని రైతుల నుంచి ఆధారాల సేకరణలో వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. నల్లబెల్లి మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో రజిత నేతృత్వంలో అధికారులు మేడిపల్లి, గుండ్లపహాడ్‌లో పంట రుణాలు పొంది కాని రైతుల నుంచి ఆధారాలు సేకరించారు. ఏఈవోలు పాల్గొన్నారు. అలాగే, ఖానాపురం మండలంలోని రంగాపురంలో పంట రుణమాఫీ కాని 26 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు.

రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

మార్కెట్‌ను అభివృద్ధి చేస్తాం

చైర్మన్ పాలాయి శ్రీనివాస్

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

నర్సంపేట, ఆగస్టు 30: నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతు విశ్రాంతి భవనంలో కనీస వసతులు లేవన్నారు. మార్కెట్ ఆవరణ, విశ్రాంతి భవనంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కరెంటు స్తంభాలు, వైరింగ్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్‌లో ఇనుము స్క్రాప్‌ను వేలం వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గోదాముల చుట్టూ సీసీ వేయాలని తీర్మానం చేశామన్నారు. వైస్ చైర్మన్ హరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని, డైరెక్టర్లు రమేశ్, మధుకర్, అశోక్, కుమారస్వామి, రామారావు, జ్యోతి, ధంజ్య, శ్రీనివాస్, అయూబ్ ఖాన్, సారంగపాణి, ప్రభాకర్, దామోదర్ పాల్గొన్నారు.

దీక్షకు సంఘీభావం ప్రకటిస్తున్న న్యాయవాది మహేందర్, డీబీఎఫ్ నాయకులు

ఆరో రోజుకు ఆమరణ దీక్ష

- బీసీ డిక్లరేషన్‌పై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్
- అస్వస్థతకు గురైన చాపర్తి కుమారస్వామి
- సంఘీభావం తెలిపిన పలు సంఘాల నాయకులు

గీసుగొండ, ఆగస్టు 30 : బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా గీసుగొండ మండలకేంద్రంలో బీసీ నాయకుడు, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. దీక్షలో కూర్చున్న కుమారస్వామి మధ్యాహ్నం అస్వస్థతకు గురి కావటంతో స్థానిక వైద్యులు పరీక్షలు చేశారు. దీక్షకు ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు మాదాసి సురేశ్, ప్రసాద్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి డిక్లరేషన్‌పై హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం చేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పుట్టగతులు ఉండవన్నారు. బీసీ డిక్లరేషన్‌పై ప్రభుత్వం ప్రకటన చేయకుంటే ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సురేశ్, సాయిబాబా, కొమురయ్య, హరినాథ్, ఐలయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

3న ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు

నల్లబెల్లి, ఆగస్టు 30: వచ్చే నెల 3న జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు నిర్వహించనున్నట్లు మహాసభ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు గందె శ్రీనివాస్‌గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. గీసుగొండ మండలం గొర్రెకుంట కీర్తినగర్‌లోని వాసవీమాత కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ట్రాలీ యూనియన్ నూతన కమిటీ

జితేందర్‌రెడ్డి

నల్లబెల్లి, ఆగస్టు 30: ట్రాలీ యూనియన్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆల్ల జితేందర్, ప్రధాన కార్యదర్శిగా కోల లింగయ్య, ఉపాధ్యక్షుడిగా జక్కుల వినయ్, కార్యదర్శిగా ఆవునూరి రవి, సంగెం సాంబయ్య, కోడూరి భాస్కర్, పల్లె సాయి, కోశాధికారిగా డీ.రాజు ఎన్నికయ్యారు.

సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలి

కాశీబుగ్గ, ఆగస్టు 30: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగి కుటుంబ పోషణలో కీలకపాత్ర పోషించాలని వరంగల్ ఇండస్ట్రీస్ జీఎం వీఎస్ రాజు అన్నారు. వరంగల్ 19వ డివిజన్‌లోని స్వశక్తి భవన్‌లో మహిళలకు బ్యూటీషియన్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎం హాజరై ఆరు వారాలు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే, ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్, మా జనని ఉమెన్ సొసైటీ సర్వీస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి మాధవి, సౌమ్య, ఆడెపు స్వప్న పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

గీసుగొండ, ఆగస్టు 30: వరంగల్ 15వ డివిజన్ పోతురాజు పల్లి, 16వ డివిజన్ ధర్మారంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో గురువారం రాత్రి దొంగలు తాళాలు పగులగొట్టి హుండీల్లో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు ముత్తిలింగం, శంకరయ్య, బాలరాజు, రమేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

తుది గడువు పెంపు

గిర్మాజీపేట, ఆగస్టు 30: ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు తుది గడువును వచ్చే నెల 7 వరకు పెంచినట్లు డీఈఐవో డాక్టర్ శ్రీధర్‌సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్పులు చేర్పులు చేసుకునే విద్యార్థుల కోసం డిలీట్ ఆప్షన్ శనివారం వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని డీఈఐవో కోరారు.

పౌరహక్కులపై ప్రజలకు అవగాహన

ఖానాపురం/దుగ్గొండి, ఆగస్టు 30: ఖానాపురం మండలంలోని చిలుకమ్మనగర్‌లో శుక్రవారం ఆర్ఐ సత్యనారాయణ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకమ్మనగర్‌లో అంతర్గత రోడ్ల అభివృద్ధి చేపట్టాలని తీర్మానించారు. జీపీ భవన నిర్మాణం, పేదలకు పక్కా ఇళ్ల నిర్మించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అధికారి విజయ్ మాట్లాడుతూ చిలుకమ్మనగర్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.గడ్డం సుభద్ర, రామగిరి శ్రీనివాస్, కార్యదర్శి సురేశ్ పాల్గొన్నారు. దుగ్గొండి మండలం మదిర, మందపల్లిలో చట్టాలపై ఎంపీడీవో లెక్కల అరుందతి అవగాహన కల్పించారు. ఎవరైనా పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు బస్‌పాస్ మేళా

ఖానాపురం, ఆగస్టు 30: మండలకేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో ఖానాపురం, పెద్దమ్మగడ్డ, మనుబోతులగడ్డలోని దివ్యాంగులకు శనివారం బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఖానాపురం కార్యదర్శి సుప్రజ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 8.30 గంటలకు ప్రారంభం అవుతుందని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, పాస్‌ఫోటో, రూ. 50 వెంట తీసుకుని రావాలని కోరారు.

ప్రజలకు సేవలు అందిస్తేనే గుర్తింపు

సంగెం, ఆగ